క్లుప్తంగా

టికెట్ కోసం దరఖాస్తు



జనగామ: జనగామ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం నెల్లుట్ల ప్రీతం సోమవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ పార్టీ సీనియర్ నేత, నెల్లుట్ల నర్సింగరావు వారసుడిగా ఆయన దరఖాస్తు వేయగా, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్, హరీష్, రాజు తదితర నాయకులు వెంట ఉన్నారు.

ఎన్నిక

దేవరుప్పుల: మండలంలోని గొల్లపల్లి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా తీగల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని గొల్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిన ప్రజలు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు నీరాజనం పలుకడం ఖాయమన్నారు. కన్న యాదగిరి, బట్ట యాదగిరి, కడారి అంజయ్య, అంజయ్య, మల్లయ్య, అబ్బయ్య పాల్గొన్నారు.

టై, బెల్టుల అందజేత



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ కోరెం శ్వేత హిరేన్ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీకార్డులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎండి పర్వేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలన్నారు. ఎన్ఆర్ఐ శ్వేత హిరేన్ ప్రతాప్‌రెడ్డి టై, బెల్టులు, ఐడి కార్డులకు విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాసర్ల సరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (ఐ)లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి మందులు అందజేశారు. అనంతరం ఉప్పుగల్లు పశువైద్యాధికారి కె.శ్రీనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గోపా ల మిత్ర సూపర్‌వైజర్ వై రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు లచ్చయ్య, రమణాచారి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌తో కలిసి ఉద్యమాలు చేస్తాం

జనగామ: నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్‌తో కలిసి ఐక్య ఉద్యమాలు చేస్తామని టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య, తాళ్లపల్లి ఏల్లేష్, చీకట్ల నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అరెస్ట్..

రఘునాథపల్లి: ఏపీలో చంద్రబాబునాయుడి రిమాండ్‌ను నిరసిస్తూ టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టగా ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ రికార్డుల్లో జమ, ఖర్చులను పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా రాయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్తులు ఇళ్లలోని చెత్తను ఆరుబయట వేయకుండా జీపీ ట్రాక్టర్లలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రైలుకిందపడి యువకుడి ఆత్మహత్య



పర్శరాములు (ఫైల్)

జనగామ రూరల్: రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి జనగామ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మరిగడికి చెందిన సాంబరాజుల పర్శరాములు (26) జనగామస్టేషన్ పరిధిలో లింక్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అమరులను విస్మరించడం తగదు



షేక్‌బందగీ స్తూపానికి నివాళులర్పిస్తున్న రాజారెడ్డి తదితరులు

దేవరుప్పుల: భూమికోసం భుక్తి కోసం బానిస విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన రైతాంగ సాయధ పోరాట యోధులకు సముచిత గుర్తింపులో తెలంగాణ ప్రభుత్వం విస్మరించడం తగదని సీపీఐ జిల్లాకార్యదర్శి, జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు,. సోమవారం తెలంగాణ విమోచన ఉద్యమాన్ని ఊరూరా తెలిపేందుకు తలపెట్టిన సీపీఐ జీపుజాత కామారెడ్డి గూడెం షెక్ బందగీ, ధర్మాపురం ఠాణునాయక్ స్మారక స్తూపాలకు ఘననివాళులర్పిస్తూ వెళ్లారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సిద్ధించినా తెలంగాణ నిజాం సర్కారు, పాలకుర్తి ప్రాంతం దేశముఖ్‌ల ఆగడాలను అణిచివేసేందుకు కొనసాగిన మహత్తర రైతాంగ సాయుధ పోరాటానికి పురిటిగడ్డ యోధులను బీఆర్ఎస్ ప్రభుత్వం స్మరించకపోవడం సిగ్గుచేటన్నారు. ఓట్ల రాజకీయం కోసం తప్ప నాటియోధులు కన్న కలలు సాకారం చేయడంలో తీవ్ర వైఫల్యం పొందారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోనే నిజాం నవాబు మెడలు వంచి ఇండియాలో విలీనం చేసిన చరిత్రను మతోన్మాద పార్టీలు వక్రీకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడిత ప్రజల విముక్తి కోసం పేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన యోధుల స్ఫూర్తితో మలివిడత తెలంగాణ విముక్తి పోరు సఫలీకృతమయిందన్నారు. అలాంటి ఉద్యమ చరిత్ర భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో చేరుస్తూ హైదరాబాద్ ట్యాంకుబండ్‌పై స్మృతి చిహ్నాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య , రాష్ట్ర సమితి సభ్యుడు పాతూరి సుగుణమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు సొప్పరి సోమయ్య, సీనియర్ నాయకుడు బెజగంఎల్లయ్య పాల్గొన్నారు.

ఐలమ్మకు నివాళి

పాలకుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పేదలకు భూమిని పంచింది కమ్యూనిస్టులేనని రాజారెడ్డి అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో చాకలి అయిలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర నాయకురాలు సుగుణమ్మ, శ్రీనివాస్, సాయన్న, కావటి యాదయ్య, రమేష్, చింతకింది అరుణ తదితరులు పాల్గొన్నారు.

పాతబీటు బజార్‌లో గుంజస్థాపన పూజ



గుంజపూజలో కౌన్సిలర్ తదితరులు

జనగామ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని 27వ వార్డు పాత బీట్ బజార్‌లో గణేశ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుంజ స్థాపన పూజ కార్యక్రమం నిర్వహించారు. పూజారి గోవిందయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, పజ్జూరి లక్ష్మీనర్సయ్య, కమిటీ సభ్యులు ఐత శ్రీకాంత్, బచ్చు అశోక్, సోమ హనుమంతరావు, నందకిషోర్ బజాజ్, బుస్సా పాండు, బచ్చు రమేష్, గోవిందు లోహియ, అరుగుల శ్రీనివాస్, తోట పాండు ప్రత్యేక పూజ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బచ్చన్నపేట: శ్రావణ మాస చివరి వారం సందర్భంగా మండలంలోని కొడవటూర్ శ్రీ సిద్దేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే మండలంలోని చిన్న రామన్‌చర్లలోని స్వయంభూ శ్రీరామలింగేశ్వరాలయంలో, బండనాగారం, కొన్నెలోని రామలింగేశ్వరాలయంలో శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ మాట్లాడుతూ హిందువులకు ఇది శుభ మాసమని అని, ఈ మాసంలోనే అన్ని శుభకార్యాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

విద్యాశాఖలో విలీనం చేయాలని సర్వమత ప్రార్థనలు



పూజ చేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు

జనగామ: తమను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం సర్వమత ప్రార్థనలు చేశారు. వారు జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులో చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం ఎనిమిదివ రోజు కొనసాగాయి. తెలంగాణ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి బృందం దీక్షలకు మద్దతు ప్రకటించిన అనంతరం మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగులు మరో ఉద్యమం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కనీస వేతన స్కేలు సైతం అమలు చేయడం లేదన్నారు. బీఎస్పీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మహబూబ్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు వంగాల కుమార్, నీరటి దీపక్ సంఘీభావం తెలిపారు. అంతకు ముందు దళిత గిరిజన టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ లాల్మనాయక్, రాములు, నిర్మల్‌రావు, కాల్‌రామ్, వెంకన్న, రత్నాకర్, పాండు సంఘీభావం తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కవిత

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసురావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లోని కంప్యూటర్లు, ఇతర పరికరాలతో పాటు నేరాలకు సంబంధించిన వాహనాల వివరాలను తెలుసుకొని ఎస్సై ప్రవీణ్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ శ్రీనివాసురెడ్డి ఉన్నారు.

నూతన సాగు విధానం చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చిల్పూరు: ప్రస్తుతం కూలీల కొరత ఉందని, దాని నివారణకు నూతన సాగు విధానం చేపట్టాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు అన్నారు. మండలంలోని పల్లగుట్టలో సోమవారం నాగరాజు వ్యవసాయ పొలం వద్ద దాదాపు 60 ఎకరాల్లో వరిపంటపై డ్రోన్ సాయంతో మందు పిచికారీ చేసేందుకు అగ్రికాపిటా సంస్థ వారు సర్పంచ్ బొట్టు మానస ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగు, కలుపు నివారణ కోసం డ్రోన్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. బొట్టు చేరాలు, దార అశోక్‌పాల్, జంగిటి రేణుక, జీడి ఆనందం,గుర్రం యాదగిరి, శ్రీనివాస్, ఎనమల వెంకటస్వామి, జీడి రమేష్, బాసెట్టి జయప్రకాష్ ఉన్నారు.

స్వర్ణ ప్రాశం పంపిణీ



పిల్లలకు స్వర్ణపాశం వేస్తున్న డాక్టర్ అంజిరెడ్డి

జనగామ: పట్టణం హైదరాబాద్ రోడ్డున ఉన్న వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్నెస్ సెంటర్‌లో పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం 0 నుంచి 16 ఏళ్ల పిల్లలకు ఉచితంగా స్వర్ణ ప్రాశం లిక్విడ్ పంపిణీ చేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 70 మంది పిల్లలకు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రతి నెల ఉచిత స్వర్ణ ప్రాశం శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వర్ణ ప్రాశం తీసుకుంటే పిల్లల్లో కండరాల పటిష్టత, మేధోశక్తి, జీర్ణశక్తి, చర్మకాంతితో పాటు రోగనిరోధక శక్తి, అన్ని రకాల అలర్జీల నుంచి రక్షణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వంగపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర సంక్షేమ సంస్థ వార్షికోత్సవం



సంస్థ అధ్యక్షుడిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ కృష్ణ

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో సోమవారం శ్రీ వెంకటేశ్వర సంక్షేమ సంస్థ 36వ వార్షికోత్సవాన్ని సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ సమావేశానికి 162 మంది సభ్యులు హాజరు కావడంతో సందడి నెలకొంది. సంక్షేమ సంస్థకు సేవలు అందజేస్తున్న సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా స్థాపక మండలి గాదె శ్రీహరి, కొడిదేటి శంకర్‌ల నేతృత్వంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆలేటి యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సరాబు శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు ముప్పిడి శ్రీనివాస్, ఎండీ అహ్మద్‌పాషా, శాగ దేవరాజు, ఆడిటి కమిటీ నాసగోని శ్రీనివాస్, సారయ్య, సలహా సంఘం సభ్యులుగా జిట్టె వీరస్వామి, కొకీస్ బాల్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి శ్రీదర్, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సర్వే చేస్తున్న ఆశ కార్యకర్త

బచ్చన్నపేట: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం ప్రణీత అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారంలో ఇంటింటా ఫీవర్ సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి అందులో దోమలు, ఈగలు వృద్ధి చెదుతుంతాయని, వాటి ద్వారా జ్వరం వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వచ్చినట్లు అనిపిస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకొని అవసరమైన ఒందులు తీసుకోవాలన్నారు. డెంగీ జ్వరాన్ని తొలి దశలో గుర్తిస్తే సులువుగా నివారించవచ్చనని తెలిపారు. ఆశ కార్యకర్త ఇజ్జగిరి అనిత ,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగను సోమవారం నిర్వహించారు. గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ఆటోలు, ట్రాక్టర్‌లను తిప్పారు. కురుమ కులస్తులు బీరప్ప దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భోనాలను ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా తరలివెళ్లారు.

సంక్షిప్త సమాచారం

అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులు సహకరించాలని మండలంలోని బండనాగారం సర్పంచ్ శివరాత్రి కవితరాజనర్సు అన్నారు. సోమవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించి జీపీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, పంచాయతీ కార్యదర్శి భరత్ పాల్గొన్నారు.

'ఆలయాల్లో రాజకీయాలు చేస్తోంది ఎర్రబెల్లినే'

పాలకుర్తి టౌన్: ఆధ్యాత్మికత, అభివృద్ధి ముసుగులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓట్ల రాజకీయాలు చేస్తున్నాడని పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో ఓటమి భయంతోనే దేవుడి పేరుతో రాకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులపై విమర్శలు చేస్తున్నాడని అన్నారు. అనుముల మల్లారెడ్డి, జలగం కుమార్, సత్తయ్య, నాగయ్య, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల అరెస్టు, విడుదల

రఘునాథపల్లి: సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని పలువురు ఆశ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆశ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సాయంత్రం సొంత పూచీకత్తుపై పంపించారు.

15న క్విజ్ పోటీలు

పాలకుర్తి టౌన్: గిరిజన విద్యార్థులో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గీతం యూనివర్సిటీ ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం గూడూరు గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో ఈనెల 15న క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కందుకూరి మనోహర సోమవారం ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌పార్మింగ్ ఆటిట్యూడ్స్ టవర్స్ సైన్స్ ఎగ్జిబిషన్ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్విజ్ పోటీల్లో గిరిజన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 14 వరకు పేర్లను 9963586737, 8919551854 నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

చిల్పూరు: శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడిని నియమించాలని ఎస్‌కే పాషా సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్ సెల్‌లో వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ పాఠశాలలో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు లేక పోవడంతో గతంలో నలుగురు విద్యార్థులు 10వ తరగతి సైన్స్ జబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఉపాధ్యాయుని నియామకంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు.

గ్యాస్ పొయ్యి, సిలిండర్ల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి సోమవారం గ్యాస్ పొయ్యి, రెండు సిలిండర్లను అందజేశారు. అదే విధంగా పాఠశాలకు చెందిన 96 మంది విద్యార్థులకు ప్లేట్లను బహూకరించారు. మధ్యాహ్న భోజన కార్మికురాలు పొన్నం లక్ష్మి భర్త మృతిచెందిన విషయాన్ని తెలుసుకుని రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

నివాళి

లింగాలఘణపురం: మండలంలోని రాంచంద్రగూడానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు గంగుల రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే రాజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈరవెన్నులో..



పాలకుర్తి: ఈరవెన్ను కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ముస్కు రాము నానమ్మ రాజమ్మ(70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు షరీఫ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిరెడ్డి సత్తిరెడ్డి, టీపీసీసీ పాలకుర్తి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ కొండ శ్రీను, నియోజకవర్గ నాయకుడు గోనె మహేందర్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గాదెపాక భాస్కర్, యువజన కాంగ్రెస్ నాయకుడు అశోక్, పులి భాస్కర్, సోమ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మహిళా ఆర్థిక సాధికారతలో ఐకేపీ పాత్ర కీలకం



ప్రోత్సాహకాలు అందుకున్న ఐకేపీ సిబ్బందితో కుమారస్వామి

దేవరుప్పుల: మహిళల ఆర్థిక సాధికారతలో ఇందిర క్రాంతి పథం సిబ్బంది పాత్ర కీలకమని యూబీఐ మేనేజర్ కుమారస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐకేపీ, సమాఖ్యల సమన్వయంతో ఆర్థిక లావాదేవీలు-పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమాజ అభివృద్ధిలోనే కుటుంబ ఆర్థికాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటా మహిళలను పొదుపు సంఘాల్లో చేర్చి రుణాలు ఇప్పించి వీఓలను సమన్వయం చేస్తూ వసూలు చేయడంలో అంకితభావంతో పనిచేస్తున్న వీఓఏల పనితీరు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దే సిబ్బందిని సన్మానించి వీఓఏలకు ప్రోత్సాహకంగా చీరెలను అందించారు. యూబీఐ ఆర్డీఓ మంజునాథ, సబ్‌మేనేజ్ ఉదయకిరణ్, క్రెడిట్ ఆఫీసర్ బాలకృష్ణ, చంద్రశేఖర్, సుమన్, ప్రత్యూష, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతికి పునాదులు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి కోసం పునాదులు వేశారని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధరావత్ తండా, గోప్యా నాయక్ తండాలోని బీఆర్ఎస్ నాయకుడు, ఉస్మానియా జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి నాయకత్వాన తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో పెద్దఎత్తున చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నల్ల యాదగిరి, కృష్ణ, తుకారాం, చింతల రవీందర్ రెడ్డి, తాళ్లపల్లి వేణు, రవీందర్, దేవా నాయక్, బిక్యా, బీకోజీ, సైదులు, తుక్యా, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఆకారపు దేవన్న ఎంపిక



అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న రాధాకృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు-2023కు బీఎస్పీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన ఆకారపు దేవన్నను ఎంపిక చేసినట్లు అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్ఏ(బహుజన సాహిత్య అకాడమీ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లో దేవన్నకు ఆదివారం అందించారు. కాగా, సోమవారం ఘన్‌పూర్‌లో దేవన్న విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఏ ప్రతీ ఏడాది ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థల వారికి ఈ అవార్డును అందిస్తారన్నారు. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందని, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణకు, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం.గౌతమ్, రాష్ట్ర కార్యదర్శి కనుకుంట్ల విజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ 15న న్యూఢిల్లీలో జరిగే ఆల్‌ఇండియా బహుజన రైటర్స్ నాల్గవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఇర్రి రమణారెడ్డి

బచ్చన్నపేట: ఆలింపూర్‌లో మృతి చెందిన దండాల సరోజన, దాసారం సరోజన కుటుంబ సభ్యులను రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం

మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కొల్లూరు యాదగిరి కుటుంబ సభ్యులకు కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండి వెంకట్‌రెడ్డి సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మృతి చెందిన మంగోల్ దేవదాసు కుటుంబ సభ్యులకు ఆ గ్రామ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి మల్లేష్ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ గొల్లపల్లి ఆంజనేయులుగౌడ్, నాయకులు బొమ్మెన ఆంజనేయులు, గుర్రపు బాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి, రాజు, బాబు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపెల్లి శ్యామ్ డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సోమవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గాదె శ్రీధర్, చాడ ఏలియా, ఇసురం శ్రీను, నలిమెల ఏలియా, నలిమెల నాగరాజు, గుర్రం అశోక్, గాదె రాంచంద్రం, గుర్రం నవీన్, హరినాథ్, యాకస్వామి, చంద్రయ్య, యాదగిరి పాల్గొన్నారు.

బైక్ ఐడియా అదుర్స్



బైక్‌కు నాగలి కట్టి దుక్కిదున్నుతున్న వెంకన్న

చిల్పూరు: పొలం దున్నడానికి ఎడ్లు అందుబాటులో లేక పోవడం, ట్రాక్టర్‌కు కిరాయి ఎక్కువ ఉండడంతో రైతు తన బైక్‌తో కొత్త ఐడియా చేశాడు. ఎకరం సాలు దున్నాడు. మండలంలోని శ్రీపతిపలికి చెందిన రైతు దున్నపోతుల వెంకన్నకు రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల వర్షాలు పడడంతో పత్తి, మిరప విత్తనాలు వేసేందుకు దుక్కి దున్నేందుకు ఎడ్లకోసం ప్రయత్నాలు చేశాడు. అవి అందుబాటులో లేక పోవడంతో ట్రాక్టర్‌తో దున్నించేందుకు అడుగగా అద్దె ఎక్కువ చెప్పారు. దీంతో సమీప రైతు కొయ్యడ నరేష్ సహకారంతో తన సొంత ద్విచక్ర వాహనానికి ప్రత్యేకంగా చేయించిన ఇనుప నాగలిని కట్టాడు. అతను నడుపుతుండగా వెనుక తోడుగా సహకారం అందించగా ఎకరం వరకు దున్నారు. కేవలం రూ.330 ఖర్చుతో దున్నినట్టు వెంకన్న తెలిపారు.

శ్రీహరిని కలిసిన ప్రజాప్రతినిధులు

చిల్పూరు: ఇప్పటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులకు కొరత లేదని, ఈ ఎన్నికలు ముగియగానే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేలా ప్రజాప్రతినిధులకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. చిల్పూరు మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సోమవారం కడియంను కలిశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కడియం దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, శ్యాంకుమార్‌రెడ్డి, అశోక్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కృష్ణాజీగూడెం, పల్లగుట్ట గ్రామాల్లో ఇటీవల అనారోగ్యాలతో సాదం బక్క రామరాజు, బొట్టు రాజు, అడప రమేష్‌లు మృతి చెందారు. కాగా, సోమవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.